సాక్షి
తిరుపతి
బుధవారం । 25 । అక్టోబర్ । 2023



వైభవంగా కాలభైరవ కల్యాణం

రాయలచెరువు కట్ట వద్ద రాయల మండపంలో మంగళవారం ఏకవీర ఫౌండేషన్ వారు కాలభైరవ కల్యాణం నిర్వహించారు.



ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

ఏర్పేడు మండలం మర్రిమందలోని అమ్మవారి ఆలయంలో మంగళవారం ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించారు.

	గరిష్ఠం	కనిష్ఠం
తిరుపతి	36	22
చిత్తూరు	34	21
తిరుమల	32	18
గూడూరు	37	23
నగరి	36	22

న్యూస్‌రీల్

శ్రీవారి సేవలో కేంద్ర మంత్రి



కేంద్రమంత్రికి లడ్డూ ప్రసాదం అందిస్తున్న టీటీడీ చైర్మన్

తిరుమల : తిరుమల శ్రీవారిని కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ సోమవారం దర్శించుకున్నారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి లడ్డూప్రసాదాలు అందజేశారు. ఈఓ ఏవీ ధర్మారెడ్డి పాల్గొన్నారు.

అన్న ప్రసాదం ట్రస్ట్‌కు రూ.10 లక్షల విరాళం

తిరుమల: ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు అహ్మదాబాద్‌కు చెందిన వికాస్ కుమార్ కిషోర్ బాయ్ రూ.10లక్షల విరాళం అందించారు. ఈ మేరకు ఆదివారం రాత్రి అశ్వవాహన సేవలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డికి డీడీ అందజేశారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 10 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 70,693 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 21,864 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.2.33 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన వారికి సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన వారికి 2 గంటల్లో దర్శనమవుతోంది.

నేటి నుంచి కాంట్రాక్ట్ అధ్యాపకులకు ఇంటర్వ్యూలు

తిరుపతి సిటీ : ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న 33 కాంట్రాక్ట్ అధ్యాపక పోస్టులకు బుధవారం నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతిరామయ్య తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మూడు రోజులపాటు ఇంటర్వ్యూలు కొనసాగుతాయని వెల్లడించారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

రేపటి నుంచి పీజీ కళాశాలల పునఃప్రారంభం

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలోని పీజీ కళాశాలలు గురువారం నుంచి తిరిగి ప్రారంభం కానున్నాయి. దసరా సెలవులు ముగియడంతో ఈ నెల 26 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని వర్సిటీ అధికారులు తెలిపారు. అలాగే వర్సిటీ పరిధిలోని అన్ని డిగ్రీ కళాశాలల తరగతులు బుధవారం నుంచే ప్రారంభమవుతాయి.

నేడు అధ్యాపక పోస్టులకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ

తిరుపతి సిటీ: ఎస్వీ వేదిక్ యూనివర్సిటీలో పార్ట్‌టైమ్ (అవర్లీ బేసిస్) అధ్యాపక పోస్టులకు బుధవారం వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్టు వర్సిటీ రిజిస్ట్రార్ ఒక ప్రకటనలో తెలిపారు. వర్సిటీలో శుక్ల యజుర్వేద భాష్యం సబ్జెక్టు, వైఖానస ఆగమ సబ్జెక్టుల బోధన కోసం 2 పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులలో పీజీ 55శాతం మార్కులతో పాటు, నెట్, స్లెట్, సెట్ లేదా పీహెచ్‌డీ పట్టా పొంది ఉండాలని పేర్కొన్నారు. 2సెట్ల బయోడేటాతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలియజేశారు.

శ్రీమహిషాసుర మర్దినిగా శ్రీమూలస్థాన ఎల్లమ్మ



మహిషాసుర మర్దిని అలంకరణలో అమ్మవారు

చంద్రగిరి: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చంద్రగిరి గ్రామ దేవత శ్రీమూలస్థాన ఎల్లమ్మ అమ్మవారు చివరి రోజైన మంగళవారం సాయంత్రం శ్రీమహిషాసుర మర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఇందులో భాగంగా ఉదయం బాలాలయంలోని అమ్మవారికి నిత్య కైంకర్యాలను నిర్వహించి, అలంకరణ చేపట్టారు. అనంతరం సాయంత్రం బాలాలయ ఆవరణలో అమ్మవారికి శ్రీమహిషాసుర మర్దిని అలంకరణలో కొలువు దీర్చారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉభయదారులుగా తిరుమలకు చెందిన మణ్యం మునిరెడ్డి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్‌రెడ్డి, ఈఓ తిమ్మారెడ్డి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.



శ్రీవారి పుష్కరిణిలో అశేష భక్తజనం (ఇన్‌సెట్) విశేషాలంకరణలో దేవదేవేరులు, చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు, తిరుమంజనసేవ అనంతరం మలయప్పస్వామి, చక్రత్తాళ్వార్

పవిత్రం.. పరిపూర్ణం



ఉభయదేవేరులతో శ్రీవారు

- తిరుమలలో శాస్త్రోక్తంగా చక్రస్నానం
- దేవదేవేరులు.. చక్రత్తాళ్వార్‌కు స్నపన తిరుమంజనం
- భారీగా పాల్గొన్న భక్తజనం
- శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం

బ్రహ్మోత్సవ వేళ తిరుగిరులు అల వైకుంఠాన్ని తలపించాయి.. ఆధ్యాత్మిక వైభవాన్ని ఇనుమడింపజేస్తూ సకల జనులను భక్తిపారవశ్యంలో ఓలలాడించాయి.. స్నపన తిరుమంజసేవలో ఉభయదేవేరీ సమేత మలయప్పతోపాటు మహిమాన్విత చక్రత్తాళ్వార్‌ను అభిషేకించి విశేష ద్రవ్యాలు పరమ పావనమయ్యాయి. వేదపండితులు పఠించిన పాశురాల శ్రవణంతో భక్తుల హృదయాలు పులకించాయి. సుగంధ సుమాల అలంకరణలో దేవదేవేరుల దివ్యతేజస్సును వీక్షించి తన్మయత్వం చెందాయి. చక్రస్నాన ఘట్టంలో భాగంగా పుష్కరిణిలో పుణ్యస్నానం ఆచరించి పునీతమయ్యాయి.

తిరుమల : శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు సోమవారం ఉదయం చక్రస్నానంతో పరిపూర్ణమయ్యాయి. ఈ సందర్భంగా వేకువనే స్వామివారికి పల్లకీ సేవ నిర్వహించారు. భూవరాహస్వామి ఆలయం ముఖ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారు, సుదర్శన చక్రత్తాళ్వార్‌కు స్నపన తిరుమంజనం వైభవంగా జరిపించారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ఏవీ ధర్మారెడ్డి దంపతులు, ఎస్పీ పరమేశ్వరరెడ్డి, జేఈఓలు సదాభార్గవి, వీరబ్రహ్మం, సీవీఎస్‌ఓ నరసింహకిశోర్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీవారికి హారతి సమర్పణ



పల్లకీసేవలో టీటీడీ చైర్మన్ భూమన, ఈఓ ధర్మారెడ్డి







పుణ్యస్నానమాచరిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ధర్మారెడ్డి, కలెక్టర్ వెంకటరమణారెడ్డి, సీవీఎస్‌ఓ నరసింహకిశోర్, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

నేటి నుంచి రుద్ర పాదాల ముక్కోటి ఉత్సవాలు

చంద్రగిరి: మండలంలోని తొండవాడ సమీపంలోని స్వర్ణముఖినది ఒడ్డున వెలసిన శ్రీఅగస్తీశ్వర స్వామివారి రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాలను వేడుకగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా బుధవారం సాయంత్రం 6 గంటలకు భూమి పూజతో ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. ఆలయ ధర్మకర్త మొగిలి రఘురామిరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏటా ముక్కోటి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయన్నారు. ముక్కోటి ఉత్సవాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని, భక్తులు సౌకర్యార్థం ప్రసాదాలు, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, వాహన సేవలు ఏర్పాటు చేసినట్లుగా తెలిపారు. గురువారం గణపతి పూజ, అంకుర్పారణ, రాత్రి సింహ వాహనం, శుక్రవారం ఉదయం శేషవాహనం, రాత్రి భూత వాహనం, 28వ తేదీ పౌర్ణమి సందర్భంగా రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని ఆయన అన్నారు. సాయంత్రం 3.30 నుంచి 5 గంటల మధ్య



శ్రీఅగస్తీశ్వర స్వామివారు

నంది వాహన సేవను నిర్వహిస్తామని, ఆపై చంద్రగ్రహణం కారణంగా 5గంటలకు ఆలయాన్ని మూసివేస్తామని తెలిపారు. 29న కల్యాణోత్సం, 30న స్వామి, అమ్మవార్ల ఊరేగింపు, 31న రథోత్సవం, నవంబర్ 1వ తేదీన పూలంగి సేవ, మూషిక వాహనం, అధికారి నంది వాహనం, 02న త్రిశూల స్నానంతో ఉత్సవాలు పరిసమాప్తి కానున్నట్లు తెలిపారు.

26, 27న సాఫ్ట్‌బాల్, ఫెన్సింగ్ జిల్లా జట్ల ఎంపిక

తిరుపతి ఎడ్యుకేషన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 26, 27న ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్–19 సాఫ్ట్‌బాల్, ఫెన్సింగ్ బాలబాలికల జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.జయరామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 26న ఉదయం 10గంటలకు పుత్తూరులోని ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో సాఫ్ట్‌బాల్, 27న ఉదయం 9.30గంటలకు చిత్తూరు రూరల్ మండలం, సిద్ధంపల్లె జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఫెన్సింగ్ ఎంపిక పోటీలు ఉంటాయని తెలియజేశారు. ఫెన్సింగ్ పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు వారి సొంత క్రీడాసామగ్రిని తెచ్చుకోవాలన్నారు. ప్రస్తుతం ఇంటర్ చదివే విద్యార్థులే ఈ ఎంపిక పోటీలకు అర్హులని ఆయన తెలిపారు.

ముత్యాల చీరలో ముత్యాలమ్మ



పూర్ణాహుతి సమర్పిస్తున్న దృశ్యం



విశేషాలంకరణలో అమ్మవారు

చిల్లకూరు : తూర్పుకనుమూరులోని ముత్యాలమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం ఈ మేరకు అమ్మవారు ముత్యాల చీరలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో చండీ యాగం జరిపించారు. సాయంత్రం మహా త్రిపురసుందరీదేవి అలంకరణలోని ముత్యాలమ్మ ఉత్సవమూర్తిని మాడ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమానికి రామారెడ్డిపాళానికి చెందిన సన్నారెడ్డి వెంకటరమణారెడ్డి కుటుంబీకులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్‌పర్సన్ సిద్ధారెడ్డి ఇంద్రసేనమ్మ, ఈఓ నవీన్‌కుమార్ పర్యవేక్షించారు.

పునీతం.. పుణ్యస్నానం



తిరుమంజన సేవలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు

- ఘనంగా ముగిసిన తుమ్మలగుంట కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు
- చక్రస్నానానికి భారీగా తరలి వచ్చిన భక్తులు
- పాల్గొన్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు
- ధ్వజావరోహణంతో ఉత్సవాలు పరిసమాప్తం

తిరుపతి రూరల్ : తుమ్మలగుంటలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన సోమవారం ఉదయం చక్రస్నాన ఘట్టం నిర్వహించారు. కంకణభట్టార్ గిరిధర్ భట్టాచార్యులు ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్నతోపాటు సుదర్శన చక్రత్తాళ్వార్‌కు వైభవంగా స్నపన తిరుమంజనం జరిపించారు. అందులో భాగంగా విష్వక్సేనారాధన, పుణ్యాహ వచనం, ముఖ ప్రక్షాళన, ధూప దీప నైవేద్యం, ఛత్ర ఛామర వ్యజన దర్పణాది నైవేద్యం, రాజోపచారం చేపట్టారు. అర్ఘ్యపాద నివేదనలో భాగంగా పాలు, తేనె, కొబ్బరి నీళ్లు, పసుపు, గంధంతో స్నపనం చేశారు. వీటిని శంఖనిధి, పద్మనిధి, సహస్రధార, కుంభధారలతో వైఖానస ఆగమోక్తంగా స్నపనం చేపట్టారు. ఉపనిషత్తు మంత్రాలు, దశశాంతి మంత్రాలు, పురుషసూక్తం, శ్రీసూక్తం, భూసూక్తం, నీలాసూక్తం, విష్ణుసూక్తం వంటి పంచసూక్త మంత్రాలు, దివ్యప్రబంధం లోని అభిషేక సమయంలో దేవదేవునికి అనుసంధానం చేసే వేదాలను పారాయణం చేశారు. ఈ వేడుకలో ఒక్కో క్రతువులో ఒక్కో రకమైన ఉత్తమ జాతి పుష్ప మాలలను స్వామి, అమ్మవార్లకు అలంకరించారు. అనంతరం శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు.

భారీగా తరలివచ్చిన భక్తులు

పవిత్రమైన చక్రస్నానంలో పాల్గొనేందుకు జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తుమ్మలగుంటకు తరలివచ్చారు. తెల్లవారుజామునుంచే ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసి పోయింది. ఉదయం 7 గంటల నుంచి స్నపన తిరుమంజన సేవ నిర్వహించారు. అనంతరం చక్రత్తాళ్వార్‌ను ఆలయ పుష్కరిణికి తీసుకువచ్చారు. ఆ అమృత ఘడియల్లో పుష్కరిణిలో మునిగేందుకు భక్తులు పోటెత్తారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు, తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజావరోహణం

సోమవారం సాయంత్రం 5.30 నుంచి 7 గంటల నడుమ ఘనంగా ధ్వజావరోహణం నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను పరిపూర్ణం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ నల్లందుల సుబ్బరామిరెడ్డి పాల్గొన్నారు.



పుష్కరిణిలో పుణ్యస్నానం చేస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు, తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి



పుష్కరిణిలో స్నానమాచరిస్తున్న భక్తులు

క్లుప్తంగా

ఘనంగా శ్రీసాయినాథుని సమాధి మహోత్సవం



ఉత్సవంలో బాబా మందిరం ధర్మకర్త వేల్పుల గంగరాజు

తిరుపతి కల్చరల్‌: తిరుచానూరు రోడ్డులోని శ్రీనివాసపురంలో వెలసిన శ్రీషిరిడి సాయిబాబా మందిరంలో మంగళవారం శ్రీసాయినాథుని 105వ సమాధి మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయినాథుని విగ్రహానికి ఉదయం కాకడ హారతి, అనంతరం మహావిశేష క్షీరాభిషేకం నిర్వహించి చేసి అలంకరణతో కొలువుదీర్చి భక్తులకు దర్శనం కల్పించారు. ఓం సాయిరామ భక్త భజన బృందం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం సాయినాథ ఉత్సవమూర్తి విశేష అలంకరణలో పల్లకిపై పురవీధులలో ఘనంగా ఊరేగింపు చేపట్టారు. రాత్రి సాయినాథుని సమాధికి విశేష పుష్పాలంకరణ పుష్పాభిషేకం నిర్వహించారు. మందిరం ధర్మకర్త, విశ్రాంత ఏఎస్పీ వేల్పుల గంగరాజు, ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు వేల్పుల లక్ష్మీదేవి, భక్తులు పాల్గొన్నారు.

మహిళా వర్సిటీ కాన్వొకేషన్‌ నోటిఫికేషన్‌ విడుదల

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం 21వ వార్షిక కాన్వొకేషన్‌ నోటిఫికేషన్‌ను వర్సిటీ అధికారులు విడుదల చేశారు. ఈ మేరకు వర్సిటీ వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలను పొందుపరిచారు. 2022 విద్యా సంవత్సరం వరకు పీజీ, బీఈడీ, ఎంసీఏ, ఎల్‌ఎల్‌బీ, బీ.టెక్‌, బీ.ఫార్మసీ కోర్సులను పూర్తి చేసిన విద్యార్థినులు వచ్చేనెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు www.rpmvv.ac.in వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని తెలియజేశారు.

రబీ.. ఎరువులు రెడీ!

వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. అన్నదాతలకు అండగా నిలిచేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. రైతుభరోసా కేంద్రాలతో క్షేత్రస్థాయిలో సాగుకు సహకారం అందిస్తోంది. అందులో భాగంగా ప్రస్తుతం రబీ అవసరాలకు తగ్గట్టు ముందస్తుగా ఎరువులు సిద్ధం చేసింది. ఆర్‌బీకేలతోపాటు సింగిల్‌విండో సొసైటీల్లోనూ అందుబాటులో ఉంచింది. కొరత లేకుండా కర్షకులందరికీ పంపిణీ చేసేందుకు పకడ్బందీగా కార్యాచరణ అమలు చేస్తోంది.

- 445 ఆర్‌బీకేల్లో ఎరువులు సిద్ధం
- మార్క్‌ఫెడ్‌ సాయంతో సరఫరా
- సొసైటీల్లోనూ అందుబాటులో ఉంచిన ప్రభుత్వం
- సీజన్‌ అవసరాలకు తగ్గట్టు నిల్వలు



తిరుపతి అర్బన్‌ : జిల్లాలోని రైతుభరోసా కేంద్రాల్లో రబీ సీజన్‌కు సంబంధించి అన్నదాతలకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ఎరువులు సరఫరా చేసింది. ఏపీ మార్క్‌ఫెడ్‌ సాయంతో మొత్తం 445 ఆర్‌బీకేల ద్వారా రైతులకు అందజేసేందుక సర్వం సిద్ధం చేసింది. అలాగే సింగిల్‌విండో సొసైటీలు, ప్రైవేట్‌ వ్యాపారుల ద్వారా కూడా ఎరువుల విక్రయానికి సన్నద్ధమైంది. గత ఖరీఫ్‌ సీజన్‌కు సంబంధించి మార్క్‌ఫెడ్‌ వారు 9,028 మెట్రిక్‌ టన్నుల ఎరువులను ఆర్‌బీకేలకు సరఫరా చేశారు. అందులో 6,561 టన్నులు విక్రయించారు. సొసైటీలకు 494 మెట్రిక్‌ టన్నులు అందిస్తే వారు మొత్తం అమ్మేశారు. ఇక ప్రైవేట్‌ వ్యాపారులు 11,500 మెట్రిక్‌ టన్నులు విక్రయించినట్లు లెక్కల్లో పేర్కొన్నారు. ఈ మేరకు ఖరీఫ్‌లో ఎక్కడా ఎరువుల కొరత తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఇదే స్ఫూర్తితో రబీలో సైతం ఎరువులు పంపిణీ చేయాలని వ్యవసాయశాఖాధికారులు నిర్ణయించారు. ఇప్పటికే ఆర్‌బీకేల్లో 3వేల మెట్రిక్‌ టన్నులు, మార్క్‌ఫెడ్‌ వద్ద మరో 2 వేల మెట్రిక్‌ టన్నులు ఎరువుల సిద్ధం చేశారు.



ఎరువులు పంపిణీ చేస్తున్న ఆర్‌బీకే సిబ్బంది

ప్రతిపాదనలు పంపించాం



రబీ సీజన్‌కు సంబంధించి ఎరువులను ఆర్బీకేలు, సొసైటీలకు పంపిణీ చేయడానికి అవసరాల మేరకు ప్రతిపాదనలు పంపించాం. ఖరీఫ్‌లో ఎక్కడా కొరత లేకుండా అందించాం. అదే తరహాలో ఇప్పుడు పంపిణీకి సిద్ధంగా ఉన్నాం. యూరియాతోపాటు, డీఏపీ, కాంప్లెక్స్‌ తదితర ఎరువులను అందుబాటులో ఉంచుతాం. ఇప్పటికే ఆర్‌బీకేలు, మార్క్‌ఫెడ్‌ వద్ద ఎరువులు ఉన్నాయి.

- తాయారమ్మ, మార్క్‌ఫెడ్‌ జిల్లా మేనేజర్‌

కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు



ప్రైవేటు డీలర్లు ఎక్కడైనా ఎరువులకు కృత్రిమ కొరత సృష్టిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటాం. దీనిపై ప్రత్యేక నిఘా పెట్టాం. ఆర్బీకేల్లో పకడ్బందీగా ఎరువులు పంపిణీ చేస్తున్నాం. సొసైటీల్లోనే ఎరువులున్నాయి. రైతులకు సకాలంలో ఎరువుల అందించేందుకు కృషి చేస్తున్నాం. ఆర్‌బీకేల సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాం.

- ప్రసాద్‌రావు, జిల్లా వ్యవసాయశాఖాధికారి

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



ఆర్‌బీకేలు వ్యవసాయానికి చక్కగా సహకారం అందిస్తున్నాయి. పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా మా గ్రామంలోనే సాగుకు అవసరమైనవన్నీ అందుబాటులో ఉంటున్నాయి. గత ఖరీఫ్‌లో రైతులందరికీ పకడ్బందీగా కొరత లేకుండా ఎరువులు పంపిణీ చేశారు. గిట్టుబాటు ధరకే ధాన్యం కొనుగోలు చేశారు. రైతు సంక్షేమం కోసం ముందు చూపుతో ఆర్‌బీకేలను ప్రారంభించిన ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

- మధు యాదవ్‌, రైతు, చెల్లూరు, ఏర్పేడు మండలం

వేడుకగా శ్రీకన్యకాపరమేశ్వరి పార్వేట ఉత్సవం



పార్వేట ఉత్సవంలో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్‌ భూమన అభినయరెడ్డి

తిరుపతి కల్చరల్‌: కొత్తవీధిలో వెలసిన శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో దసరా సందర్భంగా మంగళవారం అమ్మవారి పార్వేట ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా టాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రత్యేక అలంకరణతో పల్లకిపై ఎంఆర్‌ పల్లి వద్దనున్న సీతమ్మ భూముల వరకు మేళతాళాల నడుమ ఊరేగింపు చేపట్టారు. అక్కడ అమ్మవారికి పూజలు చేసి సాంప్రదాయ పార్వేటి ఉత్సవాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి మేయర్‌ డాక్టర్‌ శిరీష, డెప్యూటీ మేయర్‌ భూమన అభినయరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 50 ఏళ్ల తర్వాత శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారి సాంప్రదాయ పార్వేట ఉత్సవం ఆలయ పాలక మండలి ఆధ్వర్యంలో ఆర్యవైశ్యుల నడుమ నిర్వహించడం అభినందనీయమన్నారు. తిరుపతి అభివృద్ధిలో భాగంగా చేపట్టిన మాస్టర్‌ ప్లాన్‌ రోడ్లలో ఒకటైన పంగులూరి సీతమ్మ రోడ్డును నిర్మించడానికి సహకరించిన ఆర్యవైశ్య సంఘం వారికి ప్రత్యేక కృతజ్ఞతులు తెలిపే అవకాశం కలిగిందన్నారు. ఆలయ పాలక మండలి చైర్మన్‌ పామిడి సత్యనారాయణ శెట్టి, కార్యదర్శి దిండుకుర్తి నరసింహులు, కోశాధికారి శిరీష మంజునాథ్‌, కన్వీనర్లు కొండూరి మహేష్‌, కామిశెట్టి శ్రీధర్‌, క్రిష్ణమూర్తి, హేచంద్రకుమార్‌, రామనారాయణ, ఆర్యవైశ్య పెద్దలు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

నాగలాపురం : మండలంలోని ఎస్‌ఎస్‌ పురం తూర్పు గుంట ప్రాంతంలో సోమవారం సాయంత్రం విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు.. ఎస్‌ఎస్‌ పురం గ్రామానికి చెందిన సురేష్‌ (32) మూడేళ్లుగా బీరకుప్పం సబ్‌ స్టేషన్‌లో షిఫ్ట్‌ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో వెంకట్రామరాజు అనే రైతు పొలం వద్ద లైన్‌ వేసేందుకు లైన్‌మన్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ ఆపి ఎల్‌సీ తీసుకునేలోపు సురేష్‌ విద్యుత్‌ స్తంభం ఎక్కేశాడు. దీంతో కరెంట్‌ షాక్‌కు గురై అక్కడికక్కడే మరణించాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబీకులకు అప్పగించారు.

లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- లారీ డ్రైవర్‌ మృతి



నుజ్జునుజ్జు అయిన లారీ ముందు భాగం

పాకాల : పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిపై గాదంకి టోల్‌గేట్‌ సమీపంలో సోమవారం వేకువజామున ఓ లారీని ఆర్టీసీ ఓల్వో బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌ ఎస్‌.సెంథిల్‌కుమార్‌(35) మృతి చెందాడు. వివరాలు.. గూడూరు నుంచి కోయంబత్తూరు వెళుతున్న లారీని రాంగ్‌రూట్‌లో వచ్చిన ఆర్టీసీ ఓల్వో బస్సు వేగంగా ఢీకొంది. దీంతో తమిళనాడులోని మధురై జిల్లా పెరియార్‌ తాలూకా తుల్లికుట్టినాయకర్‌ పంచాయతీ టి.కృష్ణాపురానికి చెందిన సెంథిల్‌ అక్కడికక్కడే మరణించాడు. బస్సులో ప్రయాణిస్తున్న 10 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను 108లో తిరుపతి రుయాకు తరలించారు. సీఐ ఓబులేశు కేస నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు తెలిపారు.



మృతి చెందిన లారీ డ్రైవర్‌

పెట్రోల్‌, డీజిల్‌ ధరలను జీఎస్టీ పరిధిలోకి తేవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నేత రాధాకృష్ణ

తిరుపతి కల్చరల్‌: పెట్రోల్‌, డీజిల్‌ ధరలను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాకృష్ణ డిమాండ్‌ చేశారు. గంధమనేని శివయ్య భవన్‌లో మంగళవారం టాక్సీ ట్రాన్స్‌పోర్ట్‌ వర్కర్స్‌ యూనియన్‌ జనరల్‌ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు రోజుకు పెరుగుతున్న పెట్రోల్‌, డీజిల్‌ ధరలతో డ్రైవర్లు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా డ్రైవర్ల సమస్యల పరిష్కారంతోపాటు పెట్రోల్‌, డీజిల్‌ ధరలను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్‌ చేశారు. ఏఐటీయూసీ నేత ఎన్‌డీ రవి, టాక్సీ వర్కర్స్‌ యూనియన్‌ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్‌వీ.రమేష్‌, ఏపీ.బాల, ఎల్‌కే.నాయుడు, రైల్వే బాల, టాక్సీ డ్రైవర్లు పాల్గొన్నారు.

బైక్‌పై నుంచి పడి యువకుడికి గాయాలు

చిల్లకూరు : మండలంలోని తీపనూరు వద్ద మంగళవారం బైక్‌పై నుంచి పడి ఓ యువకుడు గాయపడ్డాడు. వివరాలు.. తీపనూరు గ్రామానికి చెందిన సాయికిరణ్‌ బైక్‌పై గూడూరుకు బయలు దేరాడు. గ్రామ సమీపంలోని వంతెన వద్ద బైక్‌ అదుపు తప్పడంతో పడిపోయాడు. తలకు తీవ్రమైన గాయాలు కావడంతో స్థానికులు 108లో గూడూకు ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. దీనిపై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు.

రైలు ఢీకొని మహిళ మృతి

తిరుపతి రూరల్‌ : తిరుపతి– చంద్రగిరి మార్గంలో పెరుమాళ్లపల్లె ఎస్వీ నగర్‌ వద్ద మంగళవారం రైలు ఢీకొని ఓ మహిళ మృతి చెందింది. స్థానికుల సమాచారం మేరకు రైల్వే హెడ్‌ కానిస్టేబుల్‌ ఉదయ్‌శేఖర్‌రెడ్డి, కానిస్టేబుల్‌ చంద్రశేఖర్‌ ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్‌ఐ ప్రవీణ్‌ కుమార్‌ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ఐరాల: మండలంలోని 35 యర్లంపల్లె మలుపు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు చిత్తూరు లక్ష్మీనగర్‌కాలనీకి చెందిన ఎం.దిలీప్‌కుమార్‌(41) భార్య ప్రమీల, కుమారులు మోక్షిత్‌, కౌషల్‌ ఆదివారం దివిటివారిపల్లెలో బంధువుల ఇంటి వచ్చారు. వారిని తీసుకు వెళ్లేందుకు దిలీప్‌కుమార్‌ సోమవారం ద్విచక్ర వాహనంలో చిత్తూరు నుంచి దివిటివారిపల్లెకు బయలుదేరాడు. ఈ క్రమంలో 35 యర్లంపల్లె సమీపంలోని మలుపు వద్ద వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన దిలీప్‌కుమార్‌ను స్థానికులు 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. బావమరిది నిరంజన్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

రాష్ట్ర హాకీ జట్టుకు అభినందన



బాలుర హాకీ జట్టు

గూడూరురూరల్‌ : చెన్నైలో ఈనెల 17 నుంచి 24వ తేదీ వరకు హాకీ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన సబ్‌ జూనియర్‌ బాలుర హాకీ చాంపియన్‌షిప్‌లో ఏపీ జట్టు పుదుచ్చేరిపై విజయం సాధించి, మూడో స్థానం కైవసం చేసుకోవడంపై హాకీ సంఘం జిల్లా అధ్యక్షుడు టి.స్వర్ణన్‌రాజ్‌ అభినందనలు తెలిపారు. జట్టుకు ఈనెల 13 నుంచి 16వ తేదీ వరకు గూడూరులోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో శిక్షణ ఇచ్చినట్లు వెల్లడించారు. . ఈ మేరకు జట్టు విజయంపై హాకీ సంఘం ఏపీ చీఫ్‌ ప్యాట్రన్‌ ఎం.నిరంజన్‌రెడ్డి, అధ్యక్షుడు చాణక్యరాజ్‌, జనరల్‌ సెక్రటరీ హర్షవర్ధన్‌, ట్రెజరర్‌ పి.థామస్‌ పీటర్‌, కార్యదర్శి ఆదిత్య హర్షం వ్యక్తం చేశారు. జట్టుకు శిక్షణ ఇచ్చిన గూడూరు హాకీ కోచ్‌ దీపక్‌ ఆకాష్‌, పులివెందుల హాకీ కోచ్‌ రవి, మేనేజర్‌ ప్రకాశం రవి, జట్టు సభ్యులను ప్రశంసించారు.

పూర్ణాహుతితో ముగిసిన దసరా ఉత్సవాలు



పూర్ణాహుతి సమర్పిస్తున్న వేదపండితులు



సిద్ధేశ్వరానంద భారతీ స్వామి ఆశీర్వచనం అందుకుంటున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

రామచంద్రాపురం: మండలంలోని రాయలచెరువు సమీపంలో వెలసిన శ్రీశక్తిపీఠంలో మంగళవారం పూర్ణాహుతితో దసరా ఉత్సవాలకు ముగింపు పలికారు. ఈ సందర్భంగా పీఠంలో కొలువైన శ్వేత వారాహి దేవికి, శ్రీమరకతశక్తి కాళీదేవికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, పట్టువస్త్రాలతో అమ్మవార్లను అలంకరించారు. అనంతరం పీఠం ప్రాంగణంలోని యాగశాలలో పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీ స్వామి, మాతాజీ శ్రీరమ్యానంద భారతీ ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించి పూర్ణాహుతితో కార్యక్రమాన్ని పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, తిరుపతి మేయర్‌ శిరీష పాల్గొని పీఠాధిపతి శ్రీ సిద్ధేశ్వరానంద భారతీ స్వామి, మాతాజీ శ్రీరమ్యానంద భారతీల ఆశీర్వచనాలు పొందారు.

శ్రీపొక్కాలమ్మకు వెండి ఆభరణాలు



ప్రత్యేకాలంకరణలో అమ్మవారు, వీక్షిస్తున్న దాత, సర్పంచ్‌ రామచంద్రారెడ్డి తదితరులు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు గ్రామ దేవత శ్రీపొక్కాలమ్మ అమ్మవారికి సర్పంచ్‌ రామచంద్రారెడ్డి దంపతులు మంగళవారం వెండి ఆభరణాలను మంగళవారం విరాళంగా అందజేశారు. రూ. 6.20లక్షల విలువైన వెండి కిరీటంతో కూడిన నాగపడిగ, వెండి శూలం, కవచాలను ఆలయ చైర్మన్‌ శ్రీధర్‌రెడ్డికి అందజేశారు. ముందుగా రామచంద్రారెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు వెండి ఆభరణాలకు పూజలు చేసి అమ్మవారికి అలంకరణ చేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ నిర్వాహకులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం ఆలయ చైర్మన్‌ శ్రీధర్‌ రెడ్డి, సర్పంచ్‌ రామచంద్రారెడ్డి దంపతులను సత్కరించి, అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. శ్రీపొక్కాలమ్మ అమ్మవారికి సర్పంచ్‌ రామచంద్రారెడ్డి సుమారు 7.5 కిలోల వెండి ఆభరణాలను విరాళంగా అందజేసినట్లు ఆలయ చైర్మన్‌ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు నరేష్‌ రెడ్డి, యోగానందరెడ్డి, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటే సహించం



మాట్లాడుతున్న సీపీఎం నేత సుబ్రమణ్యం

తిరుపతి కల్చరల్‌: నగర అభివృద్ధిని అడ్డుకుంటే సహించేది లేదని, అఖిలపక్షం, పలు ప్రజా సంఘాల నేతలు హెచ్చరించారు. తిరుపతి అభివృద్ధి వేదిక కన్వీనర్‌ టి.సుబ్రమణ్యం ఆధ్వర్యంలో సోమవారం యశోద నగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో రౌండ్‌ టేబుల్‌ సమావేశం నిర్వహించారు. తిరుపతి అభివృద్ధిని అడ్డుకోవడాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం టీటీడీ ఏడీ బిల్డింగ్‌ వద్ద భారీ నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. 500 కోట్ల ఆదాయం, 1000 కోట్ల టర్నోవర్‌ ఉన్న ఏ సంస్థ అయినా సామాజిక ప్రయోజనాలు కాపాడేందుకు తమ ఆదాయంలో రెండు శాతం నిధులు అభివృద్ధికి కేటాయించాలని 2013లో కేంద్ర ప్రభుత్వం చట్టం చేసిందని, ఆ చట్టానికి లోబడి రెండు శాతంలో ఒక శాతాన్ని తిరుపతి మున్సిపాలిటీకి ఇవ్వడం అధర్మం ఎలా అవుతుందని వారు ప్రశ్నించారు. సీపీఎం నేతలు టి.సుబ్రమణ్యం, వేణు, మల్లికార్జునరావు, చిన్న, బాలాజి, గంగులప్ప, చంద్రశేఖర్‌, జనసేన నేత మునస్వామి, బీఆర్‌ఎస్‌ నేత బెల్లంకొండ సురేష్‌, సురేష్‌, బీసీ సంరక్షణ సంఘం నేత నారాయణ పాల్గొన్నారు.

భక్తితో చేసే పనులు ముక్తిని ప్రసాదిస్తాయి



మాట్లాడుతున్న నిర్వాహకుడు ప్రవీణ్‌జైన్‌

తిరుపతి కల్చరల్‌: భక్తి శ్రద్ధలతో చేసే పనులు ముక్తిని ప్రసాదిస్తాయని తిరుపతి కార్పొరేషన్‌ మేయర్‌ డాక్టర్‌ శిరీష తెలిపారు. కపిలతీర్థం రోడ్డులోని ప్రేమ్‌దాస్‌ మందిరంలో జై అంబి సేవా మండల్‌ ఆధ్వర్యంలో గత తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న నవరాత్రి వేడుకలు మంగళవారం విజయదశమి రోజున ఘనంగా ముగిశాయి. ఈ వేడుకల్లో హాజరైన మేయర్‌ మాట్లాడుతూ జై అంబి సేవా మండల్‌ ఆధ్వర్యంలో 13 ఏళ్లుగా నవరాత్రి ఉత్సవాలు కుటుంబ సభ్యులతో కలిసి జరుపుకోవడం సంతోషకరమన్నారు. జై అంబి మండల్‌ నిర్వాహకుడు ప్రవీణ్‌ జైన్‌, నిర్వాహకులు రోషన్‌ పరెక్‌, సంపత్‌సోని, అరుణ్‌ సింగ్‌, హిమత్‌ సింగ్‌, రణ్వీర్‌ గెహ్లాట్‌, శ్యామ్‌ గెహ్లాట్‌, భవేష్‌, భవిక్‌ పాల్గొన్నారు.

పండుగ వేళ విషాదం



కార్తీక్‌ మృతదేహం



కార్తీక్‌ (ఫైల్‌)





మృతి చెందిన మురళి, ఆనంద్‌బాబు

- రెండు బైక్‌ల ఢీ : ముగ్గురి మృతి
- మరొకరికి తీవ్ర గాయాలు



ఘటనాస్థలంలో మృతదేహాలు, గాయపడిన సంతోష్‌

నాయుడుపేటటౌన్‌ : విజయదశమి పండుగ వేళ నాలుగు కుటుంబాల్లో విషాదం నిండింది. నాయుడుపేట మండలం బిరదవాడ వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం ముగ్గురి ప్రాణాలను కబళించింది. వివరాలు.. బిరదవాడకు చెందిన దామవరపు కార్తీక్‌ (20) గూడూరులోని ఓ ప్రైవేట్‌ ఇంజినీరింగ్‌ కళాశాలలో చదువుతున్నాడు. అదే గ్రామంలో మేనకూరు సెజ్‌లో పనిచేసే తుమ్మా ఆనందబాబు(22)తో కలిసి బైక్‌పై సమీపంలోని శ్రీనివాసపురంలో ఉన్న ఆలయానికి బయలుదేరాడు. ఈ క్రమంలోనే శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలం పచ్చికోళ్లమిట్టకు చెందిన ఆవుల మురళి(45), తెలంగాణలోని నిజామాబాద్‌ జిల్లాకు చెందిన సంతోష్‌ సూళ్లూరుపేట నుంచి బైక్‌పై నాయుడుపేటకు వస్తున్నారు. మార్గం మధ్య లో రెండు బైక్‌లు ఢీకొన్నాయి. దీంతో కార్తీక్‌, మురళి అక్కడికక్కడే మరణించారు. ఆనంద్‌బాబు, సంతోష్‌ తీవ్రంగా గాయపడ్డారు. సీఐ నరసింహారావు తమ సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను పట్టణంలో ని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. ఆనంద్‌బాబు పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. చికిత్సపొందుతూ మరణించాడు. ఈ మేరకు పోలీసు లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుల కుటుంబీకులు నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి చేరుకున్నారు. మృతదేహాలను చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు. కుటుంబసభ్యుల రోదనలకు చూపరులు చలించిపోయారు.